క్లుప్తంగా

నియామకం

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని కృష్ణ కాలనీ పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా నియమించారు. గౌరవ సలహాదారుడు తౌటం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఎన్నికల అధికారి బూర రాజేందర్ కమిటీని ప్రకటించారు. పరపతి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలగొండ రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడిగా భాగవతం భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా సామల శ్రీనివాస్, బొద్దుల శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా అడ్డగట్ల శ్రీధర్, సహాయ కార్యదర్శిగా కుసుమ చంద్రశేఖర్, కోశాధికారిగా కుసుమ కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులుగా చిప్ప సాయిరాం, అందే మురళి, గడ్డం అశోక్ కుమార్, కందగట్ల రాజు, తదితరులను ఎన్నుకున్నారు.

బాధ్యులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్

కాటారం: భూపాలపల్లి అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన సంఘటనకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మహాముత్తారం మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థుల ప్రాణాలతో ఉపాధ్యాయులు, సిబ్బంది చెలగాటమాడటం అమానుషం అన్నారు. ప్రభుత్వాలపై నమ్మకంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్‌లో ఉంచి చదివిస్తుంటే ఉపాధ్యాయులు ఇలాంటి వాటికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి సంఘటనల కారణంగా ప్రజలకు ప్రభుత్వ హాస్టళ్లు, విద్యావ్యవస్థపై నమ్మకం పోతుందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బాధ్యులను అరెస్ట్ చేసి జైలుకు పంపాలని అన్నారు.

వైకుంఠరథం అందజేత

టేకుమట్ల: మండలంలోని కుందనపల్లి గ్రామానికి చెందిన పిరిసింగుల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పిరిసింగుల సంతోష్‌కుమార్–శోభారాణి దంపతులు ఆదివారం గ్రామానికి రూ.రెండు లక్షల యాభై వేల విలువ చేసే వైకుంఠరథాన్ని అందజేశారు. గ్రామస్తుల సమక్షంలో గ్రామ ప్రత్యేకాధికారి సురేష్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి తన నాన్న గుర్తుగా వైకుంఠరథాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వైకుంఠరథాన్ని అందజేసిన సంతోష్‌కుమార్–శోభారాణి దంపతులను అధికారులు, గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు.

ఆర్థిక సాయం

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగిని బచ్చల సారక్క(స్వరూప) భర్త ఎర్రయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు లేకపోగా విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆదివారం స్వరూపకు రూ.7500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కలహన, సంధ్యారాణి, మౌనిక, సింధు, శివరాణి, కరుణ, కోమల, మల్లేశ్వరీ ఉన్నారు.

పరామర్శ

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట ఏవైఎస్ నాయకులు గుర్రపు రాజేందర్, జన్నె యుగేందర్, పుల్ల ప్రతాప్, కట్కూరి రాజేందర్, తదితరులు ఉన్నారు.

గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు



మండపాన్ని ఏర్పాటు చేస్తున్న గణపతి కమిటీ సభ్యులు



రామాలయంలో ఏర్పాటు చేస్తున్న మండపం

- మండపాలు వేస్తున్న నిర్వాహకులు
- ముందస్తుగా విగ్రహాలను కొనుగోలు

ఏటూరునాగారం: ఈనెల 27న గణపతి నవరాత్రులు ప్రారంభం అవుతున్న సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. మండపాలను నిర్మించడంతో పాటు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున వినాయకుడి విక్రయాలను అందుబాటులోకి తెచ్చారు. మండలం నుంచే కాక మంగపేట, వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం మండలాల నుంచి ఉత్సవ కమిటీ సభ్యులు వినాయకుడి విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మండల కేంద్రానికి వస్తున్నారు.

ప్రత్యేక అనుమతులు

గణపతి నవరాత్రి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సన్నద్ధం కావడంతో రాష్ట్ర పోలీసులు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించి అందులో ముందస్తు అనుమతి తీసుకునేవిధంగా అవగాహన కల్పించారు. ఇటీవల ఏఎస్పీ శివం ఉపాధ్యాయ గణపతి నవరాత్రి ఉత్సవాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమతులను ముందుగానే కమిటీ వారికి వివరించారు. దీంతో కమిటీ సభ్యులు ఆ దిశలో అనుమతులను ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల ద్వారా పొందుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయకుడి విగ్రహాలు

మట్టి విగ్రహాలపై ఫోకస్

ప్లాస్టర్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలతో ఉత్సవాలు చేసి నిమజ్జనం చేయడం వల్ల గోదావరి, వాగులు, చెరువులు కలుషితం అవుతున్నాయని పర్యావరణ ప్రేమికుల హెచ్చరికలతో కమిటీ వారు కొంత మంది మట్టి విగ్రహాలతో ఉత్సవాలు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. మట్టి విగ్రహాలను తీసుకురావడానికి వరంగల్ నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.

ఏర్పాట్లు ముమ్మరం



గుమ్మడిదొడ్డిలో..

వాజేడు: గణపతి నవరాత్రి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 17 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో ఈ నెల 27నుంచి నవరాత్రులను నిర్వహించడానికి మండపాలను సిద్ధం చేస్తున్నారు. నవరాత్రులను నిర్వహించడానికి అవసరమైన అన్ని రకాల అనుమతులను సంబంధిత శాఖల నుంచి ముందస్తుగా తీసుకుంటున్నారు.

గిరాకీ లేదు..



వినాయకుడి విగ్రహాలను ఎక్కువగా తెచ్చాం. ఈ ఏడాది అంతగా గిరాకీ లేదు. కొద్దిగొప్ప విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఎక్కువగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. దానివల్ల పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు.

– రవితేజ, విగ్రహాల వ్యాపారి, ఏటూరునాగారం

మట్టి విగ్రహాలే..



మూడేళ్లుగా మట్టి విగ్రహాలతోనే రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నాం. ఎలాంటి వాతావరణ కలుష్యం, పర్యావరణం దెబ్బతినకుండా తగు జాగ్రత్తలు పాటిస్తున్నాం.

– రాహుల్, రామాలయం గణపతి కమిటీ అధ్యక్షుడు

ఉచిత వైద్యశిబిరం

ఏటూరునాగారం: మండలంలోని మామిడిగూడెం గంటలగుంట ప్రాంతంలోని గొత్తికోయగూడెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆరాధ్య ప్రైవేటు ఆస్పత్రి వైద్యబృందం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ వైద్యుడు విష్ణుమోహన్, సివిల్ సర్జన్ సారంగపాణి, చెవి ముక్కు స్పెషలిస్ట్ నాగరాజు ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి మందులు అందజేశారు. 45 గిరిజన కుటుంబాలకు రక్త పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింగరావు, యూత్ జిల్లా కార్యదర్శి గౌస్, వెంకటనారాయణ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది, నాయకులు

కుట్టు మిషన్ల పంపిణీ ఎప్పుడో?

చిట్యాల: మహిళ సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా కుట్టుమిషన్లు అందించాలని 2023 సంవత్సరంలో అప్పటి జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నిధులు కేటాయించి కుట్టు మిషన్లు కొనుగోలు చేసి ఆయా మండలాలకు సరాఫరా చేశారు. ఈ మేరకు అర్హులైన మహిళలకు కుట్టు మిషన్లు అందించడానికి జాబితాను సిద్ధం చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఆ తరువాత ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ పూర్తిగా ఆగిపోయింది. దీంతో అప్పటి నుంచి కుట్టుమిషన్లను మండలంలోని రైతుల వేదికల్లో, మరికొన్ని స్థానిక ఐకేపీ కార్యాలయంలో భద్రపరిచారు. అవి ఇప్పటి వరకు అక్కడే నిరుపయోగంగానే ఉండి దుమ్ముపడుతున్నాయి. అలాగే మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. దీంతో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. లబ్ధిదారులకు కుట్టుమిషన్లు పంపిణీ ఉన్నట్లా.. లేనట్లా అని వారు ఎదురుచూస్తున్నారు. కావున సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల జోక్యం లేకుండా వెంటనే కుట్టుమిషన్లు పంపిణీ ప్రక్రియ ప్రారంభించాలని మహిళ సంఘాల సభ్యులు కోరుతున్నారు.



చిట్యాలలో నిరుపయోగంగా ఉన్న కుట్టుమిషన్లు

ముగిసిన ఈశా గ్రామోత్సవం



వాలీబాల్ విజేత ఏటూరునాగారం జట్టుతో ఈశా ఫౌండేషన్, వాలీబాల్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో వాలీబాల్ విజేత ఏటూరునాగారం, ద్వితీయ స్థానంలో రాంపూర్, తృతీయ స్థానంలో వాజేడు జట్లు నిలిచాయి. త్రోబాల్ విజేత చెర్లపాలెం, రెండవ స్థానంలో శాయంపేట, మూడో స్థానంలో ఎల్లబెల్లి జట్లు నిలిశాయి. ముగింపు వేడుకలకు డాక్టర్ భగీరథ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు



క్షతగాత్రుడు నిఖిల్

మంగపేట: రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ కార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలోని బోరునర్సాపురం పంచాయతీ పరిధిలోని చెరుపల్లికి వెళ్లే రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. కమలాపురంలోని సాయిబాబా టెంపుల్ కాలనీకి చెందిన నిఖిల్ చెరుపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు సెంట్రింగ్ పనికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గమధ్యలోని చెరుపల్లికి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వారిని తప్పించే క్రమంలో అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. తలకు బలంగా తాకడంతో స్పృహతప్పి కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గ్రంథాలయంపై చిన్నచూపు



శిథిలావస్థలో ఉన్న పెంకుటింటిలో నిర్వహిస్తున్న గ్రంథాలయం



దినపత్రికలు చదువుతున్న గ్రామస్తులు

- శిథిలావస్థలో భవనం
- పుస్తకాలు లేక నిరుద్యోగుల ఇబ్బంది

రేగొండ (కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాక గ్రామంలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన గ్రంథాలయంపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. ఉమ్మడి రేగొండ మండలంలోనే పేరుగాంచిన చిన్నకోడేపాకలో అప్పటి పెద్దలు దీన్ని ఏర్పాటు చేశారు. నవలలు, కథలు, తెలుగు దినపత్రికలు అందుబాటులో ఉంచేవారు. సాయంత్రం నాలుగైతే గ్రామస్తులు అక్కడికి పరుగు తీసేవారు. కాని రానురాను అభివృద్ధి చెందాల్సిన గ్రంథాలయం వెలవెలబోతోంది. ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు, అభ్యర్థులకు పుస్తకాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొందరు మాత్రం దినపత్రికలు, పాత పుస్తకాలు చదివేందుకు వస్తున్నారు. కాని గ్రంథాలయాన్ని ఎవరు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పాఠకులు కూర్చోడానికి సరైన ఫర్నీచర్ కూడా లేదు. గ్రంథాలయం పెంకుటిళ్లు కావడంతో కోతుల బీభత్సానికి పెంకలు పగిలి వర్షానికి పుస్తకాలు తడుస్తున్నాయి. అలాగే పరిసరా ప్రాంతాలు వర్షానికి బురదమయం కావడంతో ఇటీవల ఒక పాఠకుడు జారిపడితే చేయి విరిగింది.

16 పంచాయతీలకు ఒక్కటే..

కొత్తపల్లిగోరి మండలంలోని 16 గ్రామపంచాయతీలకు కలిపి ప్రభుత్వపరంగా చిన్నకోడేపాకలోని గ్రంథాలయం ఒక్కటే పెద్ద దిక్కుగా మారింది. ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించే నేపథ్యంలో గ్రామాల నిరుద్యోగులకు అవసరమయ్యే మెటీరి యల్ లేక ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నూతన భవనం నిర్మించి పుస్తకాలను అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

భవనం నిర్మించాలి



రాష్ట్ర ప్రభుత్వం లైబ్రరీలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. చిన్నకోడేపాకలోని గ్రంథాలయానికి మంచి పేరు ఉంది. దీన్ని కొనసాగించేందుకు నూతన భవన నిర్మాణం వెంటనే చేపట్టి, పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరీయల్ అందజేయాలి.

– కనకం రమేశ్, చిన్నకోడెపాక, గ్రామస్తుడు

గ్రామాల్లో కోతుల బీభత్సం

రేగొండ/టేకుమట్ల: మండలాల్లోని గ్రామాల్లో కోతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. రైతులు వేసిన పత్తి పంటలను కోతులు గుంపులు గుంపులుగా చేరి ధ్వంసం చేస్తున్నాయి. వానకాలం సీజన్‌లో అధిక పెట్టుబడులు పెట్టి పత్తి పంట సాగు చేయగా కోతులు పత్తి కాయలను తింటూ చెట్లను నాశనం చేస్తున్నాయి. కోతుల నుంచి పంటను రక్షించేందుకు ఎన్నో విధాల ప్రయత్నం చేసిన ఫలితం లేదని రైతులు వాపోయారు. గ్రామాల్లోని ఇళ్లలోకి కోతులు చొరబడి పలు వస్తువులను తీసుకెళ్తు, చిన్న, పెద్ద తేడా లేకుండా మనుషులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నట్లు పలువురు బాధితులు తెలిపారు. తరుచూ ద్విచక్ర వాహనదారులు రోడ్లపై కోతుల సంచారంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కోతుల బీభత్సంతో మండలంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

'రాజీవ్ యువవికాసం' అందేనా?

- పథకం అమలుపై స్పష్టత కరువు
- ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు

వెంకటాపురం(కె): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు అందేనా అని యువత ఆందోళన చెందుతున్నారు. ఈ పథకానికి అధికారులు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి నెలలు గడుస్తున్నా నేటి వరకు పథకంపై ఎలాంటి స్పష్టత లేదు. దీంతో దరఖాస్తుదారులు నిరాశకు గురవుతున్నారు. కాగా లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలను బ్యాంక్ అధికారులు, ఎంపీడీఓలు చేశారు. అనంతరం ఎలాంటి లిస్టు విడుదల చేయలేదు.

మండలంలో 2006 దరఖాస్తులు

మండలంలోని 18 గ్రామ పంచాయతీల నుంచి 2006 మంది అభ్యర్థులు రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు గాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు యూనిట్‌కు ప్రభుత్వం చెల్లించనుంది. 60 నుంచి 80 శాతం వరకు సబ్సిడీ వస్తుంది. మండలానికి దాదాపు 700 వరకు యూనిట్లు కేటాయింపు ఉంటుందని అంచనా. కాగా, రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు తీసుకోవడంతో పాటు జాబితాను జిల్లాకు పంపించినా ఇంత వరకు మంజూరీపై అధికారిక ప్రకటన రాలేదు.



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

డబ్బులు జమ చేయాలి



రాజీవ్ యువ వికాసం పథకం యూనిట్లను త్వరితగతిన మంజూరు చేయాలి. ఇంటర్వ్యూలు నిర్వహించి నేటి వరకు యూనిట్లను మంజూరు చేయలేదు. యూనిట్లు మంజూరు చేసి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి.

– అఖిల్ వెంకటాపురం

మంజూరు కాలేదు



రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుకు ఇంటర్వ్యూలు నిర్వహించాం. కాని ప్రభుత్వం నుంచి ఇంకా యూనిట్లు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శలు రాలేదు వచ్చిన వెంటనే అమలు చేస్తాం.

– రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

యువత సన్మార్గంలో నడవాలి



వాలీబాల్ కిట్లను పంపిణీ చేస్తున్న పస్రా ఎస్సై కమలాకర్

- పస్రా ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: యువత సన్మార్గంలో నడవాలని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. మండలంలోని చల్వాయి, పస్రా, నాగారం, ఇప్పలగడ్డ, రాఘవపట్నం యువకులకు వాలీబాల్ కిట్‌లను ఎస్సై కమలాకర్ ఆదివారం పంపిణీ చేసి మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, క్రీడలను కెరీర్ ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. కాలేజీ చదువుకునే సమయంలో సీనియర్లు, జూనియర్లు అని ర్యాగింగ్ చేసుకోవద్దని, గంజాయి వైపు మొగ్గ చూపొద్దని అన్నారు.

రైతులను విస్మరించిన ప్రభుత్వం

- ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ నరేందర్

మంగపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతులను విస్మరించిదని వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్‌లో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడగళ్ల వానతో పంట నష్టం జరిగి ఐదు నెలలు గడుస్తున్న ప్రకటించిన పంట నష్టాన్ని చెల్లించకుండా ప్రకటనలకు పరిమితమైన ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాటి నుంచి రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయని రైతు ఆత్మహత్యలు, 24 గంటల కరెంటు సరఫరా లేక రైతులు రాత్రిపూట పొలాల్లో పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. యూరియా కోసం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు ఊడుగుల శ్రీనివాస్, పార్టీ నాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేందర్

శోభన్ మృతి ఆదివాసీలకు తీరనిలోటు

సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

ములుగు రూరల్: ఆదివాసీ సమస్యలపై నిరంతరం పోరాడిన దబ్బకట్ల శోభన్ మృతి ఆదివాసీలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గన్నగూడెంలో నిర్వహించిన శోభన్ సంతాప సభలో సీపీఎం నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గుల వాగుపై ఉన్న లోలెవెల్ వంతనకు బదులుగా హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజల పక్షాన పోరాడి వ్యక్తి శోభన్ అన్నారు. ఆదివాసీలు సాగు చేసుకొని జీవనం కొనసాగిస్తున్న పోడు భూములకు పట్టాలు అందిచాలని పోరాటాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రతన్నం రాజేందర్, ప్రవీన్, గుండబోయిన రవిగౌడ్, కొండల్‌రావు, సునిల్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తుమ్మల వెంకట్‌రెడ్డి

ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

కాళేశ్వరం: ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మహదేవపూర్ మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ద్వారా టీయూఎఫ్ మండల అధ్యక్షుడు సట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి లేఖలు రాసి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 20 నెలల నుంచి సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపిన హామీలను నెరవేర్చలేదన్నారు. మండల ఉద్యమకారుల మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, మండల ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, రాష్ట్ర అధికార ప్రతినిధి అయుబుద్దిన్ ఉన్నారు.



పోస్టుకార్డులు పంపిస్తున్న ఉద్యమకారులు